వ్యవసాయానికి అధిక రుణాలు ఇవ్వాలి

• నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మార్చి 11 : ప్రాధాన్యత రంగాలైన అగ్రికల్చర్, ఎంఎస్‌ఎంఈ(సూక్ష్మ, చిన్న, మధ్య తరహా)లకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీసీసీ(జిల్లా సంప్రదింపుల కమిటీ)సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్యాంకర్లు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చి సకాలంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. వార్షిక ప్రణాళిక 2024-25 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసానికి రూ.1984.54కోట్లతో వృద్ధి సాధించిందని, వార్షిక ప్రణాళికలో 60.62 శాతమని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా ఎస్‌ఎంఈ(చిన్న, మధ్య తరహా) సెగ్మెంట్‌కు సంబంధించి రూ.123.06కోట్లతో 48.80శాతం ప్రగతి సాధించడం జరిగిందన్నారు. ప్రాధాన్యత రంగానికి రూ.1674.14కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం నాబార్డు 2025-26కు సంబంధించి రూ.3,833.47 కోట్ల రుణ లక్ష్యంతో రూపొందించుడిన పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ గరిమనరుల, ఎస్‌ఎల్‌బీసీ ఏజీఎం శ్రీహరి, ప్రకాశ్, ఆర్‌బీఐ ఏజీఎం శ్రావ్య, ఎస్‌బీఐ ఏజీఎం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

కౌన్సిలర్‌కు మాజీ మంత్రి పరామర్శ

కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

జడ్చర్లటౌన్, మార్చి11: జిల్లా కేంద్రంలోని అభయప్రద దవాఖానలో చికిత్స పొందుతున్న జడ్చర్ల మున్సిపాలిటీలోని 23వ వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్ గౌడ్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి పరామర్శించారు. కౌన్సిలర్ ఉమా శకర్ గౌడ్ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై దవాఖానలో చేరాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వెంటనే దవాఖానకు వెళ్లి కౌన్సిలర్‌ను పరామర్శించి డాక్టర్‌తో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను సూచించారు. మాజీ మంత్రి వెంట మాజీ జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బండారి లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

జడ్చర్ల, మార్చి 11: బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ తండ్రి బండారి లక్ష్మణ్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మహబూబ్‌నగర్‌లోని శాంతికుమార్ ఇంటికెళ్లి అక్కడ బండారి లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జడ్చర్ల మున్సిపాలిటీలోని బూరెడ్డిపల్లికి చెందిన పీఏసీసీఎస్ చైర్మన్ మల్లేశ్ సోదరుడు రాంచంద్రయ్య ఇటీవల మృతిచెదగా.. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బూరెడ్డిపల్లికెళ్లి రాంచంద్రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో పీఏసీసీఎస్ చైర్మన్లు సుదర్శన్ గౌడ్, మల్లేశ్, కౌన్సిలర్లు మహేశ్, నవనీత కొండల్, బీఆర్‌ఎస్ నాయకులు యాదయ్య, రఘుపతి రెడ్డి ఆంజనేయులు, వెంకటేశ్, ప్రణీల్, నాగిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుడికి మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ

శివరాములును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట, మార్చి 11: తెలంగాణ ఉద్యమకారుడు, జానంపేట బీఆర్‌ఎస్ నాయకుడు శివరాములును మంగళవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. శివరాములుకు గుండె సంబంధిత వ్యాధితో దవాఖానలో చేరి చికిత్స తీసుకున్నాడు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల స్థానిక నాయకులతో కలిసి ఇంటికెళ్లి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆలవెంట సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింం హేయాటప్, మాజీ వైస్ ఎంపీపీ మశ్చందర్‌నాథ్ ఉన్నారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

• పీయూ ఎదుట ఎంఎస్‌ఎఫ్ రిలే నిరాహార దీక్షలు

మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 11: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం అమలు తర్వాతే గ్రూప్-1, 2, 3, ఉద్యోగ ఫలితాలు, నియామకాలు చేపట్టాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తిక్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీ ఎదుట వర్సిటీ అధ్యక్షుడు మీసాల గణేశ్ అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో చట్ట బద్ధత కల్పించే వరకు ఉద్యోగ పరీక్ష ఫలితాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో గ్రూప్స్ ఫలితాలు విడుదల చేయాలని ఏ నిరుద్యోగి వినతిపత్రం ఇవ్వలేదు.. రోడ్డెక్కి నిరసన చేపట్టలేదన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఉన్నటువంటి కాంగ్రెస్‌లో కొంతమంది స్వార్థపరుల ఒత్తిడికి తలొగ్గి మాదిగ నిరుద్యోగుల పొట్టలను కొట్టాలని చూస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు తీరును అంతా గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తించాలని హెచ్చరించారు. ఈ తీరు మార్చుకుని వెంటనే అసెంబ్లీలో వర్గీకరణ చట్ట బద్ధత కల్పించి ఏబీసీడీ వర్గీకరణ ద్వారానే ఫలితాలు వెల్లడించాలన్నారు. లేనిపక్షంలో జరిగే పరిణామాలకు కాంగ్రెస్ సర్కార్ బాధ్యత వహించాల్సి ఉంటుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టైగర్ జంగయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా నాయకులు వీరస్వామి, పీయూ జేఏసీ చైర్మన్ బత్తినిరాము, బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి దాసు, ఎంఎస్‌ఎఫ్ నాయకులు శ్రీను, రవితేజ, లిట్మస్, రాము, నాగేందర్, నరేశ్, మాలదాసరి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మడుగుసత్యారంలో పంటల పరిశీలన

నమస్తే ఎఫెక్ట్

మాగనూరు, మార్చి 11: భూగర్భజలాలు అడుగంటి నీరు లేక కరెంటు కోతలు ఎక్కువై పంటలు ఎండి పోతున్నాయని ఆదివారం 'నమస్తే తెలంగాణ' లో వచ్చిన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. మంగళవారం మాగనూరు మండలం మడుగుసత్యారంలోని రైతు నర్సింహ గౌడ్ పొలాన్ని వ్యవసాయ అధికారి పోలప్ప, ఏఈవో శివ కుమార్ గౌడ్‌సందర్శించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★ I, B. ALLAIAH S/o B. SAILU, age:33 years, Occ: Employed, R/o H.No. 4-115, Narsaipally Village, Kodair (M), Nagarkurnool Dist., I have changed my name as B. SAI CHANDRA in future for all the purposes.
NT-MBNR

CHANGE OF NAME
★ I, DEVARAPOGU ARJUNAIAH S/o D. CHINNAIAH, age:34 years, Occ: Employed, R/o H.No. 1-149, Jawaipally Village, Kollapur Mandal, Nagarkurnool Dist., I have changed my name as DEVARAPOGU ARJUN in future for all the purposes.
NT-MBNR

SHORT TERM COACHING
★ SRI CHAITANYA JUNIOR COLLEGE uppal 45 days BIPC NEET and MPC EAMCET. Contact K.ASHOK REDDY, AO. 9441884705.
NT-MBNR

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line 50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాళం వేసిన ఇండ్లకు కన్నం

• 4తులాలు బంగారం, రూ.25వేలు అపహరణ
• విచారణ చేపట్టిన పోలీసులు

జడ్చర్ల టౌన్, మార్చి 11: పట్టణంలోని సాయినగర్‌కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లోని పైఅంతస్తు, కింది పోర్షన్‌లో తాళం వేసిన ఇండ్లను దొంగలు టార్గెట్ చేసు కొని దొంగతనానికి పాల్పడిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని లింగంపేటకు చెందిన మల్లికార్జున్‌యాదవ్ కొంతకాలంగా స్థానిక సాయినగర్‌కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. స్వగ్రామంలో పని నిమిత్తం సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఈ క్రమంలో దొంగలు ఇంటి తాళాన్ని విరగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో దాచుకున్న 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.25వేలు నగదుతోపాటు వెండి సామగ్రిని ఎత్తుకెళ్లారు. అదేవిధుగా బిల్డింగ్‌లోని కింది పోర్షన్‌లో నివాసముంటున్న మనోహర్‌రెడ్డి ఇంట్లో చోరీకి యత్నించారు. అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న వారు బయటకి రాకుండా పక్కింటి ఇండ్ల తలుపులకు గొళ్లెం వేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు ఇంటి యాజమానికి సమాచారం అందించారు. ఆ తర్వాత బాధితుల సమాచారం మేరకు జడ్చర్ల ఎస్సై జయప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేశారు. మహబూబ్‌నగర్ నుంచి క్లూస్‌టీంను రప్పించి విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నిందితులకు 3నెలలు జైలుశిక్ష

జడ్చర్లటౌన్, మార్చి11: జడ్చర్ల పోలీసు స్టేషన్‌లో 2017లో నమోదైన ఓ కేసులో నిందితులకు 3నెలలు జైలుశిక్షతో పాటు రూ. 4500 జరిమానా విధిస్తూ జడ్చర్ల అదనపు కోర్టు జడ్జి మహ్మద్ ముదాసిర్ తీర్పు ఇచ్చినట్లు జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన రాములుపై దాడికి పాల్పడిన ఘటనలో అదే గ్రామానికి చెందిన వెంకటయ్య, మహేందర్, సురేందర్, హరేందర్, లక్ష్మయ్య, మానస, లక్ష్మమ్మ, సరోజ, రాజుపై 2017లో జడ్చర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు, పుర్వాపరాలను విచారించిన తదుపరి నిందితులకు 3నెలల జైలు శిక్షతోపాటు రూ. 4500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

దామరగిద్ద, మార్చి 11 : రైతుల సమస్యలు పరిష్కరించాలని బీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శరణయస్వామి అన్నారు. మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని, రైతు భరోసా మూడెకరాల వరకే నిలిచి పోయిందని, మూడెకరాల్లోపు వారిలో కూడా చాలా మందికి రాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రుణమాఫీ సమగ్రంగా పూర్తి చేయలేదని, రైతు సమస్యలపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, బుచ్చయ్య, శేఖర్ పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాగనూరు/కృష్ణ, మార్చి 11 : కృష్ణ మండల కేంద్రంలోని కృష్ణానదిలో రాత్రిళ్లు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమ తరలిస్తుండగా సోమవారం అర్ధరాత్రి టాస్క్ ఫోర్స్, కృష్ణ పోలీసులు దాడులు నిర్వహించి ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. అందులో ఒకటి ఇసుకతో ఉండగా మిగతా నాలుగు ట్రాక్టర్లు ఖాళీగా ఉన్నందున అన్ని ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ల ఓనర్స్ డ్రైవర్స్‌పై కేసు నమోదు చేశామని కృష్ణ ఎస్సై నవీద్ తెలిపారు. మల్లప్ప, కృష్ణ గ్రామానికి చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కంటి అద్దాలు పంపిణీ

నవాబ్‌పేట, మార్చి 11: మండలంలోని యన్మన్‌గండ్ల, నవాబ్‌పేట, ఇప్పటూర్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి.. అద్దాలు అవసరమున్న వారికి ఎంఈవో నాగ్యానాయక్, మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు రామకృష్ణ, వనజ, డా.హబీబున్నీసా బేగం, సిబ్బంది పార్వతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరులో మెగావైద్య శిబిరం

నవాబ్‌పేట, మార్చి11: మండలంలోని కొల్లూరులో షాద్‌నగర్‌కు చెందిన విజయ కార్డియాక్ దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. జీపీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్థానిక ఎస్సై విక్రమ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు రమాకాంత్, శ్వేత, చైతన్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

జడ్చర్ల టౌన్, మార్చి11: మున్సిపాలిటీలోని శ్రీనివాసనగర్‌లో ఓ రైతుకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిబూడిదైంది. ఇందిరానగర్‌కాలనీకి చెందిన రైతు సంజీవ్ ఏడు ట్రాక్టర్ల వరిగడ్డిని శ్రీనివాసనగర్‌లో నిల్వ చేశాడు. మంగళవారం సాయంత్రం గడ్డివాము నుంచి పొగలు మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

కోయిలకొండ కేజీబీవీ సందర్శించిన కలెక్టర్

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 11: కోయిలకొండలోని కేజీబీవీని కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించి రుచి చూశారు. కేజీబీవీలో చిన్నచిన్న మరమ్మతు పనులు వెంటనే చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జమాల్‌పూర్‌లో నర్సరీని కలెక్టర్ సందర్శించారు. వచ్చే వానకాలంలో రోడ్ సైడ్ అవెన్యూ ప్లాంటేషన్, హోం స్టేడ్‌ప్లాంటేషన్‌కు కావాల్సిన మొక్కలు సిద్ధం చేస్తున్నట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వేమా రెడ్డి ఎంపీడీవో హరి చంద్రా రెడ్డిఉన్నారు.

బాధిత మహిళలకు అండగా షీటీమ్స్

• మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల టౌన్, మార్చి11: బాధిత మహిళలకు షీటీమ్స్ అండగా నిలబడి న్యాయం పొందేలా సహాయం అందిస్తోందని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో షీటీమ్స్, గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పాల్గొని మాట్లాడారు. షీటీమ్స్ ఏర్పాటునుద్దేశం తో పాటు షీటీమ్స్ ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాలల దుర్వినియోగం, బాల్య వివాహాలు, బాలకార్మికులు, బాండెడ్ లేబర్, ఫోక్సో చట్టం గురించి వివరించారు. మహిళలు, పిల్లలు, కుటుంబ హింస బాధితులు భరోసా సెంటర్‌ను సంప్రదించి న్యాయసహాయం పొందవచ్చని చెప్పారు. అదేవిధంగా మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కౌన్సెలింగ్ సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సీఐ కమలాకర్, డబ్ల్యూఎస్ఐ వనజ, పాఠశాల హెచ్ఎం చంద్రకళ, షీటీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పరిహారం చెల్లించాలి

• ఉదండాపూర్ నిర్వాసితుల డిమాండ్
• కొనసాగుతున్న రిలే నిరాహారదీక్ష

జడ్చర్లటౌన్, మార్చి11 : పాలమూరు - రంగారెడ్డి ఎత్తి పోతల ప్రాజెక్టులో భాగంగా జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామంలో భూములు, ఇండ్లు కొల్పోయిన నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న రిలే నిరాహారదీక్ష మంగళవారం 32వ రోజుకు చేరింది. ప్రాజెక్టు పనులను అడ్డుకొని అక్కడే టెంట్ వేసు కొని నిర్వాసితులు దీక్ష చేపడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ భూములు, ఇండ్లు కోల్పోయి పరిహారం కోసం పోరాటం చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ దీక్ష చేపట్టారు. ఆర్‌అండ్ ప్యాకేజీ పెంపుతో పాటు 18 ఏండ్లు నిండిన వారికి ప్యామిలీ ప్యాకేజీ ఇచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో నిర్వాసితులు పాల్గొన్నారు.

దీక్ష చేపడుతున్న ఉదండాపూర్ నిర్వాసితులు

మా భూమి మాకు ఇప్పించండి..

• బాలానగర్ తాసీల్దార్ కార్యాలయం ఎదుట రెండు రోజులుగా బాధితుల ఆందోళన

బాలానగర్, మార్చి 11 : మండల కేంద్రం సమీపంలోని మా పొలాన్ని కొందరు కబ్జా చేశారు... మా భూమిని మాకు ఇప్పించుడంటూ బాలానగర్‌కు చెందిన సులోచనాదేవి.. ఆమె కుమారులు రెండు రోజులుగా తాసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన సులోచనాదేవికి బాలానగర్ సమీపంలోని సర్వే నెంబరు 139/1, 139/2 లో 4.05 ఎకరాల భూమి ఉన్నది. అయితే తమకు సంబంధించిన భూమి 2 ఎకరాలను కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారని సులోచనాదేవి ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని ఏడాది కాలంగా మండల, జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. కబ్జాకు గురైన తమ భూమిని తమకు ఇప్పించాలని కోరుతూ తాసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అల్వాల్ రెడ్డిఆందోళన చేస్తున్న సులోచనాదేవికి మద్దతు తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం

నారాయణపేట టౌన్, మార్చి 11 : మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందిగొండ గీత అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మహిళలపై హింస, దాడులు, లైంగికదాడులు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. నేరస్తులకు కఠిన శిక్షలు వేయడంలో ప్రభుత్వాలు చిత్త శుద్ధితో పని చేయడం లేదన్నారు. బాలికలకు ఉచిత విద్య, వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. సదస్సులో మహిళా సంఘం నాయకురాలు సమీనా, రాజేశ్వరి, బాలామణి, అమృతమ్మ, ప్రజా సంఘాల నాయకులు వెంకట్రామిరెడ్డి, గోపాల్, బాల్‌రాం, అంజిలయ్యా గౌడ్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో ఉజ్వల భవిష్యత్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 11: భగవంతుడి సృష్టిలో మనిషి గొప్పవాడయితే.. మనిషి సృష్టించిన వాటిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కృత్రిమ మేధస్సు మహోన్నతంగా నిలవనుందని ఎస్సై శివం అభిషేక్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో స్కూల్‌లో ఏర్పాటు చేసిన 'ఏఐ ఫెస్ట్ ఫస్ట్- ఇన్ ది డిస్ట్రిక్ట్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రపంచాన్ని శాసించగల స్థాయిలో ఏఐ మారబోతోందని చెప్పారు. కరస్పాండెంట్ డా.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలన్నీ కూడా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కేంద్ర బిందువుగా చేసు కొని కొనసాగుతాయన్నారు. మానవాళికి సాకేంతిక విద్య చాలా అవసరమని, ముందు తరాలకు బంగారు భవిష్యత్ రూపొందించే ఒక వినూత్న విద్య తమ పాఠశాలలో విజయవంతంగా కొనసాగడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక విద్య సహకారంతో రూపొందించిన రోబోలు ప్రదర్శించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ నరేశ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పూర్తి చేయాలి

• పాలమూరు అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

జడ్చర్ల టౌన్, మార్చి 11: మున్సిపాలిటీలో ఈనెల 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎన్ని దరఖాస్తు లొచ్చాయని వివరాలు సేకరించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భవన నిర్మాణాల గురించి సమీక్షించారు. ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో ఏమైనా సమస్యలుంటే కమిషనర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ లక్ష్మారెడ్డి, ఎల్‌టీపీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

యజమానులకు అవగాహన కల్పించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 11: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులకు క్రమబద్ధీకరణ రుసుం చెల్లించి అనాధికార లేఔట్‌లు క్రమబద్ధీకరణ చేసుకునేలా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ శివేంద్రప్రతాప్ సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాట్ల యజమానులను సందేహాలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ 08542-241165, మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ (మున్సిపల్ కార్యాలయం)లో హెల్ప్‌లైన్ నెంబర్ 7093911352ను సంప్రదించవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకుని లేఔట్ ఓనర్లతోవాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అవసరమైన పత్రాలు, ప్రభుత్వ ఉత్తర్వులు అందించాలన్నారు.

పంటల ఎంపికపై అప్రమత్తంగా ఉండాలి

• డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ భరత్‌భూషణ్

భూత్పూర్, మార్చి 11: రైతులు పంటల ఎంపికను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని పాలెం వ్యవసాయ కళాశాల డాట్ సెంటర్ కోఆర్డినేటర్ భరత్‌భూషణ తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని అమిస్తాపూర్‌లో పొలాలు, పంటలను పరిశీలించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో గ్రామానికి సంబంధించిన నమూనా పటాన్ని వేసి అధికారులు, రైతులకు పంటల ఎంపిక విధానంపై అవగాహన కల్పించారు. లోతట్టు ప్రాంతంలో ఏ పంటలను వేయాలి, గుట్టలపై ఎలాంటి పంటలను సాగు చేయాలి, ఎర్ర నెలల్లో ఏ పంటలను సాగు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పంటలకు నీరు, ఎరువుల వాడకంపై సూచనలను, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఏవో మురళీధర్, ఏఈవో ప్రసాద్‌బాబు, కళాశాల విద్యార్థులు గీత, రమాదేవి, శ్రావణి, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

13న జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలు

మాట్లాడుతున్న టెన్నికాయిట్ జిల్లా కార్యదర్శి దీప

మక్తల్, మార్చి 11: తెలంగాణ ఎన్నికల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న టెన్నికాయిట్ పోటీలు నిర్వహించనున్నట్లు పేట జిల్లా కార్యదర్శి దీప పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదేశాల మేరకు పేట జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సాయిజ్యోతి ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో 13వ తేదీ ఉదయం 9గంటలకు సీనియర్ మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభచాటిన వారిని ఈనెల 15 నుంచి 16వరకు హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో విశ్రాంత పీఈటీ గోపాలం, పీఈటీలు, రమేశ్‌కుమార్, దామోదర్, అమ్రేశ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఊట్కూర్, మార్చి 11: మండలంలోని కొల్లూరు పాఠశాలను మంగళవారం ఎంపీవో నర్సింహరాజు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించారు. విద్యార్థులకు వండేందుకు ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన బియ్యం బస్తాలను పరిశీలించి పురుగులు లేకుండా శుభ్రం చేసి వండాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే వంట ఏజెన్సీలను విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

మీ ప్రభుత్వం పోలీసులను అడ్డంపెట్టి మా పొలాల్లో సర్వే చేయిస్తోంది సార్..

• ఎమ్మెల్యే శ్రీహరితో మొరపెట్టుకున్న రైతులు

ఊట్కూర్, మార్చి 11: మీ ప్రభుత్వం పోలీసులను అడ్డంపెట్టి దౌర్జన్యంగా మా పొలాల్లో సర్వే చేయిస్తుంది సార్.. అంటూ రైతులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో మొర పెట్టుకున్నారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం పనుల్లో భాగంగా పైప్‌లైన్, ఓపెన్ కెనాల్ ద్వారా భూములు కోల్పోతున్నా రైతులతో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేయించారు. స్థానిక రైతు వేదికలో నిర్వహించిన సమావేశానికి ఊట్కూర్‌లోని దంతన్‌పల్లి, తిప్రాస్‌పల్లి, బాపురం, జీర్దహల్లి గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామానికి చెందిన రైతు బోయిని రవి మాట్లాడుతూ తమ పెద్దలు ఐదు రూపాయల కూలీతో పైసా పైసా కూడబెట్టి కొన్న భూమిని తమకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం కెనాల్ నిర్మాణం కోసం బలవంతంగా పోలీసులను అడ్డంపెట్టి సర్వే చేయిస్తుందని ఎమ్మెల్యే ముందు వాపోయారు. భూములను బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్నిస్తే ముందుగా తమ శవాలనే చూడాల్సి వస్తోందని బదులిచ్చారు. భూమి తమకు కన్న తల్లి లాంటిదని, ఇంటికో ఉద్యోగం, ఎకరాకు రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ఓ యువ ఉద్యోగి తమకు ఉన్న కొద్దిపాటి భూమిని కెనాల్ రూపంలో కోల్పోతున్నామని.. తనకు ఉద్యోగం ఉంది కానీ నా వెనుక ఉన్న వాళ్ల భూమిని నమ్ముకొని బతుకుతున్నారు.. భూమిని కోల్పోతే వాళ్ల దిక్కులేని వాళ్లు అవుతారని ఎమ్మెల్యే సమక్షంలో రోదిస్తూ తన ఆవేదనను వ్యక్తపరిచారు. బాపురం గ్రామానికి చెందిన రైతు శ్రీశైలం మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి హైదరాబాదులో రిక్షా తొక్కి భూమిని కొనుగోలు చేశానని, తక్కువ భూమి ఉండడంతో ఇప్పటికే తన కొడుకులకు పిల్లను ఇవ్వటం లేదని, ఎత్తిపోతల ప్రాజెక్టులో నా భూమి మొత్తం కోల్పోతే కొడుకుల పెళ్లి చేయలేని పరిస్థితి ఉంటుందని మొరపెట్టుకున్నాడు. మాజీ జెడ్పీటీసీ మణెమ్మ మాట్లాడుతూ.. భర్తలను కోల్పోయిన చాలామంది మహిళ రైతులు భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తూ కుటుంబ బాధ్యతలను మోస్తున్నారని.. ప్రస్తుతం భూములు కోల్పోతే అలాంటి వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందన్నారు. ఓపెన్ కెనాల్‌కు బదులు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే కొంతవరకైనా పొలం మిగిలి రైతులకు బతుకు దెరువు ఉంటుందని ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ.. జీవో 69 ద్వారా 4,480 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయించి లక్షకు పైగా ఎకరాలకు సాగు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు గ్రామాల వారీగా ప్రభుత్వ భూములను గుర్తించి రైతులకు భూమికి భూమి ఇచ్చే ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని, ఏ ఏ గ్రామాల్లో ప్రభుత్వ భూములు అనుకూలంగా ఉన్నాయో రికార్డు తయారుచేసి తనకు అందజేయాలని తాసీల్దార్ రవిని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు నారాయణపేట సభ వేదికగా ఎకరాకు రూ. 20లక్షలు అందించేందుకు సీఎం హామీ ఇచ్చారన్న విషయాన్ని గుర్తు చేశారు. సరైన న్యాయం జరగకపోతే రైతుల పక్షాన పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.